
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 26 ఫిబ్రవరి 2025






# హరహర మహాదేవ.. శంభో శంకరా

## నేడు శివరాత్రి.. ముస్తాబైన శైవక్షేత్రాలు




నేడు మహా శివరాత్రి. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. బుధవారం వేకువజాము నుంచే 'హరహర మహాదేవ శంభో శంకరా.. ఓం నమఃశివాయ' అంటూ భక్తుల నామస్మరణతో ప్రతిధ్వనించనున్నాయి. పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి, భీమవరం సోమేశ్వర స్వామి, వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రం, ఆచంట ఆచంటేశ్వరుడు, పట్టిసంలోని భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి ఆలయం, పెదవేగి సమీపంలోని బలివే రామలింగేశ్వరస్వామి తదితర క్షేత్రాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. -6లో






సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి

### శివరాత్రి ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్

ఏలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహా శివరాత్రి ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డితో కలిసి మంగళవారం తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణపై సూచనలు ఇచ్చారు. పట్టిసీమ ఉత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో సందేహాలుంటే వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. పట్టిసం, బలివే ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ కిశోర్ తెలిపారు. క్యూలైన్లు బ్రేక్ లేకుండా సజావుగా సాగేలా చూడాలని సూచించారు.

# ప్రచారం ముగిసింది.. ఓటు మిగిలింది

- పట్టభద్రుల నియోజక వర్గాల్లో అంతా సైలెంట్
- ఆరోపణలు, విమర్శలకు దూరంగా ప్రచారం
- మొదటి ప్రాధాన్య ఓటు కోసమే అందరి పాట్లు
- రేపు పోలింగ్.. ఓటర్ల కోసం నేతల జల్లెడ
- నిర్భయంగా ఓటు వేయాలని ఆర్‌వో వెట్రిసెల్వి పిలుపు
- పోస్టులో బ్యాలెట్ పత్రాల పంపిణీ
- రేపు పాఠశాలలకు సెలవు
- ఓటర్ల సౌలభ్యం కోసం హెల్ప్‌లైన్ సెంటర్లు
- పోలింగ్ ఏర్పాట్లు పూర్తి



కామవరపుకోటలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

### గెలుపు మనదే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని గుర్తించి పట్టభద్రులైన ఓటర్లు ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటు వేసి గెలిపించాలని మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. కామవరపుకోటలో పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లాలో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి కూటమి అభ్యర్థి తరపున ప్రచారం చేశారు. - 8లో..

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. గురువారం పోలింగ్ జరగనుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో 70,052 మంది ఓటర్లకు 93 పోలింగ్ కేంద్రాలు, ఏలూరు జిల్లాలో 42,282 మంది ఓటర్లకు 66 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం అధికారులకు బ్యాలెట్ పత్రాలను పంపిణీ చేయనున్నారు. బరిలో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. హోరాహోరీగా సాగిన ప్రచారంలో అభ్యర్థులంతా ఎవరంతట వారుగా ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రయత్నించారు. తమను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను పదేపదే వివరించారు. ఈ ఎన్నికల్లో తాయిలాలు లేవంటూ కేవలం మేధస్సుతోనే ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రచారంలో ఎక్కడా చిన్నపాటి వివాదాలు కూడా తలెత్తలేదు. ఆరోపణలు, విమర్శలకు దూరంగా ప్రచారం సాగింది. -7లో

'ఓపెన్' ఇంటర్ పరీక్షలపై

### కోర్టు తీర్పు రిజర్వ్

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్స్ ఇంటర్మీడియట్ పరీక్షలపై హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంపై తీర్పు కోర్టు రిజర్వ్ చేసింది. మార్చి 3 నుంచి 15వరకు పరీక్షలు జరగాల్సి ఉండగా, పలు అభ్యంతరాలపై కొందరు ఏఐ సెంటర్ల కోఆర్డినేటర్లు హైకోర్టును ఆశ్రయించారు. జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడులో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు సిబ్బంది నియామకాలు, అభ్యర్థులకు హాల్‌టికెట్ల పంపిణీ పూర్తయ్యాయి.

### 28 నుంచి సింగనపూడి రైల్వేగేటు మూత

మండవల్లి ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకాస కలవపూడి-సింగనపూడి రైల్వే గేటును ఈనెల 28న మూసివేయనున్నారు. మరమ్మతుల నిమిత్తం గేటు మూసివేస్తున్నట్లు కైకలూరు రైల్వేస్టేషన్ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. స్టేషన్ పరిధిలో ట్రాక్ మరమ్మతుల కోసం మార్చి 3న రాత్రి 7గంటల వరకు మూసివేస్తున్నామని, వాహనదారులు, ప్రయాణికులు గమనించాలన్నారు.

## లక్ష్మణుడు ప్రతిష్ఠించిన లక్ష్మణేశ్వరస్వామి ఆలయం



**నరసాపురం రూరల్ :** నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో కొలువైన శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయం దక్షణా కాశీగా పేరుగాంచింది. త్రేతాయుగంలో రావణుడు రాక్షసంహారం సంహారించి రామ, లక్ష్మణులు ఆ పాప పరిహార్ధం తరుణోపాయం సూచించవ లసిందిగా వశిష్ఠ మహ ర్షిని కోరారు. సీత, రామ లక్ష్మణుల చేతులకు వశిష్ఠ మహార్షి కంకణాన్ని కట్టి ఇవి జారవిడిచిన ప్రదేశంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తే పాప పరిహారం కలుగుతుందని తెలియజేశారు. వాటిని ధరించి రామ, లక్ష్మణులు అంతర్వేదిలో నీలకంఠేశ్వరుడిని దర్శించి అక్కడ నుంచి తిరిగి వెళ్లుతుండగా రాముడు,సీత ధరించిన కంకణాలు తూర్పుగోదావరి జిల్లా రామేశ్వరం వద్ద, లక్ష్మణుడు ధరించిన కంకణం లక్ష్మణేశ్వరం వద్ద జారిపడ్డాయి. పరమేశ్వరుడి విగ్రహాన్ని లక్ష్మణుడు అక్కడ ప్రతిష్ఠించడంతో లక్ష్మణేశ్వరంగా పేరుగాంచినట్లు పురాణాలు చెప్పుతున్నాయి. మహాశివరాత్రి పర్వ దినాన్ని పవిత్ర గోదావరిలో పుణ్యస్నానం చేసి దుర్గా లక్ష్మణేశ్వర స్వామిని దర్శించికుంటే మొక్కులు తీరుతాయన్నది భక్తుల విశ్వాసం.

## దక్షిణ కాశీ.. తాడువాయి శివక్షేత్రం



వీరభద్రస్వామి..11 వ శతాబ్దంలో రాతితో నిర్మించిన మండపం

**జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెం మండలం తాడు వాయి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం 900 సంవత్సరాల క్రితం రాతితో కట్టించారు. రాతితో నిర్మించిన మండపాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా అలానే ఉన్నాయి. స్వయం ప్రతిష్ఠమైన వీరేశ్వర స్వామి దక్షిణ ముఖంగా వెలిశారు. తాండు వాయిగా పిలవబడుతూ వ్యవహారంలో తాడువాయిగా మారింది. కామవరపుకోటతో ఈ శైవక్షేత్రం ముడిపడి ఉందని ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి రవికుమార్ శర్మ తెలిపారు. 11 వ శతాబ్ధంలో సుమారు 900 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతాన్ని రెడ్డిరాజులు పరిపాలించారని ఆ కాలంలో కామ వరపు కోటలో ఓ బ్రహ్మరాక్షసి ప్రజలను పీడిస్తూ ఉండడంతో అది చూడలేని మహారాజు అనారోగ్యానికి గురవుతారు. ఈ సమస్యకు పరిష్కారం దొరక్క దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఒకరోజు రాత్రి మహారాజు కలలో స్వామివారు కనిపించి కాశీక్షేత్రం నుంచి శివలింగం తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తే కష్టాలు తొలగిపోతాయని చెప్పారు. దీంతో వెంటనే రాజు ఇద్దరు బ్రాహ్మణులను కాశీ పంపించారు. ఆ ఇద్దరు బ్రాహ్మణులు కాశీలో శివ లింగాన్ని తీసుకుని కాలినడకన బయలుదేరారు. ఈ శివ లింగాన్ని ఎక్కడా కిందకు దించరాదని విగ్రహం ఇచ్చిన బ్రాహ్మణులు చెబుతారు. మార్గమధ్యలో సాయం సంధ్యావేళలో తాడువాయి భద్రకుండం వద్ద కాలకృత్యాలు తీర్చు కుందా మని ఆ ఇద్దరు బ్రాహ్మణులు శివ లింగాన్ని ఒక తాటిబొత్తపై పెట్టి వెళ్లారట. సంధ్యా వందనం తరువాత తిరిగి వచ్చి శివ లింగాన్ని తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా స్వామి కదలలేదట. మహారాజుకు వీరభద్రుడు కలలో కనిపించి ఇది తన సంకల్పమేనని మరో శివలింగం తీసుకు వచ్చి కామవరపుకోటలో ప్రతిష్ఠించాలని చెప్పారు. కాశీ నుంచి స్వామి వారిని తెచ్చి ప్రతిష్ఠించగా బ్రహ్మరాక్షసి పీడ నుంచి బయట పడ్డారనేది స్థల పురాణం. స్వామి తాడు వాయిలో ప్రతిష్ఠించబడినా స్వామివారి చూపు దక్షిణం వైపు ఉన్న కామవరపుకోటపై ఎప్పుడూ ఉంటుందని అర్చకులు రవికుమార్ తెలిపారు.

## తేతలిలో చాళుక్య రాజు ప్రతిష్ఠించిన శివలింగం



చాళుక్య రాజు రాజ రాజ నరేంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం

**తణుకు రూరల్ :** తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో రాజరాజేశ్వర స్వామి ఆయలంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని తూర్పు చాళుక్య రాజు రాజ రాజ నరేంద్రుడు నిర్మించి ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠిచాడని స్థల పురాణం చెబుతుంది. రాజ మహేంద్ర వరాన్ని రాజధానిగా పాలించిన తూర్పు చాళుక్య రాజు రాజరాజ నరేంద్రుని సైన్యం తేతలి గ్రామం మీదుగా వెళ్తుండగా తేతలి గ్రామంలోని పెద్ద సర్పం మార్గ మధ్యలో అడ్డ వచ్చిందని, దానిని పరిశీలించగా అది సమీపంలోని శివలింగాన్ని చుట్టుకుని వుండటాన్ని గమినించిన రాజ రాజ నరేంద్రుడు ఈ మార్గంలో శివాలయాలన్ని నిర్మించాలని భావించి తేతలి గ్రామంలోని ఇప్పుడున్న చోటనే శివాలయాన్ని నిర్మించారని చెబుతారు. అప్పటి నుంచి ఈ ఆలయాన్ని రాజ రాజేశ్వర స్వామి వారిగా పూజలు నిర్వహిస్తారని చెబుతారు.

## చిన్న కాశీ.. చల్ల చంతలపూడి శివాలయం



ఒరిగినట్లు ఉన్న మండపం

**దెందులూరు :** ఏలూరు జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధి చెంది చిన్న కాశీగా పేరు పొందిన శివాలయాల్లో అతి పురాతనమైనది దెందులూరు మండలం చల్ల చింతలపూడి మేధా దక్షిణామూర్తి శివాలయం. 640 ఏళ్ల క్రితం వేంగీ రాజులు ఆలయాన్ని నిర్మించారని స్వయంభూగా శివుడు ఇక్కడ పాదం మోపాడని పురాణ కథనం. ఇక్కడ ఉండేవాడని గ్రామ పెద్దలు, చరిత్రకారులు చెబుతున్నారు. గ్రామంలో పశువులు ఎక్కువగా ఉండి పెరుగు, పాలు పుష్కలంగా ఉండటంతో తెల్లవారు జామున నుంచే చల్లచింతలపూడిలో మజ్జిగ (చల్ల) చేయడం ప్రారంభించేవారని ఆ శబ్దానికి భరించలేని శివుడు కృష్ణా, పశ్చిమ జిల్లాలోని విజయరాయి సరిహద్దులోని బలివే గ్రామంలో బలివే రామస్వామిగా అక్కడకు వెళ్లారని చెబుతారు. వెళ్లే సమయంలో శివాలయ మండపం పడిపోతుండగా శివుడిని గ్రామస్థులందూ వెళ్ల వద్దని వేడుకోగా శివుడు ఆజ్ఞతో మండపం పడిపోకుండా నిలిచిపోయిందని స్థానిక పెద్దలు చెబు తుంటారు. కాశీకి వెళ్లలేనివారు మేధా దక్షిణామూర్తిస్వామిని దర్శిస్తే కాశీలో శివుడుని దర్శించినట్లేనని భక్తుల నమ్మిక. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. 26వ తేదీ నుంచి ఐదురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

## కొల్లేరు తీరంలో పురాతన ప్రసిద్ధ ఆలయాలు



పెదకాపవరం కుసుమేశ్వరస్వామి.. సిద్దాపురం రామలింగేశ్వరస్వామి

**ఆకివీడురూరల్ :** ఆకివీడు మండలంలోని పెదకాపవరం, సిద్దాపురం గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన పురాతన శివాలయాలు ఉన్నాయి. పెదకాపవరంలో వేణుగోపాల స్వామి ఆలయం నిర్మించేందుకు పునాదులు త్రవ్వగా బ్రహ్మ సూత్రం కలిగిన లింగం బయట పడింది. ఈ ఆలయంలో స్వామి వారు పశ్చిమ అభిముఖంగా, ఎదురుగా కోనేరు, కోనేరు ఆవల రుద్రభూమి ఉండటం విశేష. శివరాత్రి రోజున కల్యాణం నిర్వహిస్తారని అర్చకులు శర్మ తెలియజేశారు. సిద్దాపురంలోని 400 సంవత్సరాల క్రితం సిద్దులు, ఋషులుచే పర్వత వర్ధినీ సమేత రామ లింగేశ్వర స్వామి పూజలందు కున్నారని, కొల్లేరు సరస్సు శివారున ఉండటంతో కాలక్రమేణ ఆలయం శిధిలమై శివలింగం మాత్రమే మంచినీటి చెరువుగట్టుపై ఉండటంతో గ్రామస్థులు భూపతిరాజు తిమ్మరాజు, పృధ్వీ దంపతులు, దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. స్వామివారికి 108 బిందెలతో జలాభిషేకం చేస్తే కోరుకున్న కోర్కెలు తొందరగా తీరుతాయని భక్తులు విశ్వాసం. ఈ ఆలయంలో భక్తులే స్వయంగా అభిషేకాదులు నిర్వహించుకోవచ్చునని, భక్తుల కోసమే వాయు ప్రతిష్ఠ చేశామని శివరాత్రి తెల్లవారుజామున కల్యాణం నిర్వహిస్తామని తిమ్మరాజు తెలియజేశారు.

## చరిత్రకు ఆనవాళ్లు.. ఉండి, ఆకివీడు ఆలయాలు

**ఉండి :** ఉండి రాజులపేటలోని పార్వతీ సమేత చెన్న మల్లేశ్వరస్వామి పురాతనమైనది 500 సంవత్సరాలకు పూర్వం పల్లవ రాజ వంశంలో చెన్న అనే ఇంటి పేరు కలిగిన వారు వుండేవారు. వారు పల్నాడు ప్రాంతం నుంచి తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రాంతం వరకు విస్తరించి ఉన్నారు. వీరు గొప్ప శైవ ఆరాధికులు. వీరు ఆలయ నిర్మాణాలు చేయడం, వాటిని పోషించడం వంటివి చేసేవారు. వీరికి ఆనాటి విజయనగర వంశీకులతోనూ మొగల్తూరు రాజ వంశీకులతో సత్సంబంధాలు ఉండేవి. వారి అనుమతితో ఆంధ్ర ప్రాంతంలో వారి ఇంటి పేరుతో నిర్మించడం వల్ల చెన్న మల్లేశర్వ స్వామిగా పిలువబడుతున్నారు.

**ఆకివీడు :** ఆకివీడులో 460 ఏళ్ల నాటి చరిత్ర కల్గిన మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయం నూజవీడు జమిందార్లు ప్రతిష్ఠించారు. కాలక్రమేణ జీర్ణోద్ధరణకు చేరడంతో ఆనాటి వైభవానికి దీటుగా దాతల సహకారంతో 2018లో పునర్నిర్మాణం చేశారు. ఇది బ్రహ్మ సూత్రం కల్గిన శివాలయమని ఇలాంటి ఆలయాలు అరుదని అర్చకులు తెలిపారు.



ఆకివీడు భీమేశ్వరస్వామి ఆలయం.. ఉండి చెన్నమల్లేశ్వరస్వామి



విద్యుద్దీపాల వెలుగుల్లో పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయం.. రేవు నుంచి ఆలయానికి ఏర్పాట్లు



విద్యుద్దీప కాంతుల్లో గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం

# హర..హర మహాదేవ

## మహా శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

**మహా శివరాత్రి ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ప్రధాన ఆలయాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి, భీమవరం సోమేశ్వరస్వామి, పట్టిసీమ భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి, బలివే రామలింగేశ్వరస్వామి, వీరంపాలెం బాలా త్రిపుర సుందరి పీఠం, ఏలూరు జ్వాలా పహరేశ్వరస్వామి, ద్వారకా తిరుమల శివాలయం, కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి, రెడ్డిగణపవరం విశ్వేశ్వరస్వామి, తాడువాయి తదితర శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆయా ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనుంది.**



పట్టిసీమలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

### పట్టిసీమలో పటిష్ఠ ఏర్పాట్లు

పోలవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమలో పటిష్ఠ ఏర్పాట్లు నిర్వహించారు. పట్టిసీమ ఫెర్రీ రేవు నుంచి ఆలయ ప్రాంగణం వరకూ విద్యుద్దీపాలంకరణ, ఇసుక తిన్నెల్లో కాలినడక కోసం 5 వరుసల గోనె సంచులతో బాట ఏర్పాటు చేశారు. ఫెర్రీ రేవులో భక్తుల సమాచారం సేవల కోసం పోలీస్ శాఖ సీసీ టీవీ, డ్రోన్ పర్యవేక్షణ , సమాచార, హెల్ప్‌లైన్ కౌంటరు, మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్పీడు బోట్లు, 90 మంది గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేశారు. వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మురళీధరన్, కె.వాసు ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స కోసం 48 మంది వైద్యాధికారుల పర్యవేక్షణలో 240 మంది సిబ్బందితో ఫెర్రీ రేవు, ఇసుక తిన్నెలు, ఆలయ ప్రాంగణం ప్రాంతాల్లో 4 వైద్య శిబిరాలు, నాలుగు అంబులెన్సులు, ఫైర్ ఇంజను ఏర్పాటు చేశారు.

### ఏలూరు ఎస్పీ కిశోర్ పరిశీలన

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. మంగళవారం ఎస్పీ, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఆర్డీవో వెంకటరమణ పట్టిసీమ ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఫెర్రీ రేవులో సీసీ టీవీ పర్యవేక్షణ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. స్పీడు బోట్ల పనితీరు ఆయన పరిశీలించారు. నదిపై కాలిబాట, ఇసుక తిన్నెల్లో కాలిబాట, క్యూలైన్లు, ఆలయ ప్రాంగణంలో క్యూలైన్ల ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ బాలసురేష్ బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

### గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే దర్శనాలు

**భీమవరం టౌన్ :** గునుపూడి సోమేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము 3 గంటల నుంచి భక్తులకు దర్శనం ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భద్రతా ఏర్పాట్లను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ భీమారావు, డీఎస్పీ జయసూర్య వివరించారు. తెప్పోత్సవం జరిగే చంద్రపుష్కరిణి పరిశీలించారు. రథత్సవ ప్రాంతాన్ని, బందోబస్తు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఈవో రామకృష్ణంరాజు, దేవదాయ శాఖ ఇనస్పెక్టర్ వెంకటేశ్వరరావు, వన్ టౌన్ సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. సోమేశ్వరస్వామి ఆలయాన్ని జనసేన ప్రొటోకాల్ చైర్మన్, మల్లినీడి తిరుమలరావు(బాబి) ఆధ్వర్యంలో పూలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. 28 సంవత్సరాలుగా శివరాత్రికి ఆయన పూల అలంకారం చేయిస్తున్నారు.

### క్షీరారామంలో..

**పాలకొల్లు అర్బన్ :** పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయాన్ని, గాలి గోపురాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటుచేశారు. వైద్య సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ సీఐ రజనీ కుమార్ నేతృత్వంలో పోలీసు బందోబస్తుకు ఏర్పాట్లు చేశారు. సత్యసాయి సేవాసమితి, క్షీరా రామలింగేశ్వరస్వామి సేవాసమితి, సేవా సంస్థల వలంటీర్లు సేవలు అందించనున్నారు ఏర్పాట్లను పాలక ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

### వీరంపాలెంలో నేడు స్ఫటిక లింగ దర్శనం

**తాడేపల్లిగూడెం రూరల్ :** తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి మంగళవారం శివరాత్రి పూజలు కళశస్థాపనతో ప్రారంభించారు. 16 మంది వేదపండితులతో కర్రి రామకృష్ణారెడ్డి, చెక్కా రమణమూర్తి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం భూ ప్రస్థార శ్రీచక్రార్చన నిర్వహించారు. ఏడాదిలో ఒకసారే అవకాశం కల్పించే స్ఫటికలింగ దర్శనం శివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం ఐదు గంటల నుంచి ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున ఆత్మలింగానికి దేశ నలుమూలలా ఉండే 12 నదుల నుంచి తెచ్చిన నదీజలాలతో అభిషేకిస్తారు.

### వేడుకగా ఆచంటేశ్వరుని కల్యాణం

**ఆచంట:** ఆచంట రామేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మంగళవారం వేకువజామున పార్వతి అమ్మవారిని రామేశ్వరస్వామి వారికి ఇచ్చి శంకరమంచి ఉమా మహేశ్వరరావు బ్రహ్మత్వంలో కల్యాణం నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి వారి గ్రామోత్సవం వివిధ వేషధారణలు, బాణసంచా తీన్‌మార్ డప్పులతో వేడుకగా జరిగింది. బుధవారం వేకువజామునుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు , భక్తులకు దర్శనాలు జరుగుతాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ చైర్మన్ గజేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం జరిగే రథోత్సవం పురస్కరించుకుని కూడా భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ కట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

### మందలపర్రు పంచాయతన క్షేత్రంలో

**నిడమర్రు :** మందలపర్రు ఉమానీల కంఠేశ్వర పంచాయతన క్షేత్రంలో ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమం, సాయంత్రం శివపార్వతుల కల్యాణం, రాత్రి 12 లింగోద్భవ కాలంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సరిపల్లె శంకరం తెలియజేశారు. పెద నింద్రకొలను భీమే శ్వర స్వామి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మేకా వెంకటరమణ తెలియ జేశారు.



గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నయీం అస్మి

### వైభవంగా ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి కల్యాణం

**పెనుమంట్ర :** జుత్తిగ ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామికి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వాసు శర్మ గణేష్ శర్మ రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. సత్తిరాజు నరసింహారావు దంపతులు పూజలు నిర్వహించారు.హైకోర్టు సీనియర్ న్యాయవాది సత్తిరాజు, స్వామి సాయి ప్రసాద్, ఏవో సోమేశ్వరి, సర్పంచ్ తమనంపూడి వీరెడ్డి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

### బలివేలో ప్రత్యేక ఏర్పాట్లు

**ముసునూరు :** బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఉత్సవాలకు సూమారు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య తెలిపారు. సర్వ దర్శనానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, అలాగే రూ.25, రూ.100 ప్రత్యేక దర్శనం ఉందన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్, పిల్లలకు పాలు ఇచ్చేందుకు ఆలయ ప్రాంగణంలో బేబి ఫీడింగ్ బాక్స్‌ను సిద్ధం చేశామన్నారు. భక్తుల పుణ్యస్నానాలకు ఇప్పటికే స్వామివారి ఆలయం చెంతకు తమ్మిలేరు జలాలు వచ్చాయని, పంచాయతీ అధ్వర్యంలో నాలుగు మోటార్లతో రెండు వైపుల జల్లుల స్నానాలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవాలకు ఆర్టీసీ 50 ప్రత్యేక బస్సులను ఏలూరు, చింతలపూడి, సత్తుపల్లి, నూజివీడు నుండి నడుపుతుందన్నారు.ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా 526 మందితో పోలీస్‌లతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నూజివీడు డీఎస్పీ ప్రసాద్ తెలిపారు.



గునుపూడి ఆలయంలో పూలతో అలంకరణ



వీరంపాలెంలో కలశస్థాపన పూజలు



ఆచంటలో స్వామి వారి కల్యాణం

## దేవకూట పర్వతంపై వెలసిన వీరేశ్వరస్వామి

**పోలవరం :** పట్టిసీమలో గోదావరి నది మధ్యలో దేవకూట పర్వతంపై వెలసిన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధ శివక్షేత్రం దక్ష ప్రజాపతి కుమార్తె పార్వతీ దేవిని ఆమె తండ్రికి ఇష్టం లేకపోయినా శివుడు పెండ్లాడతాడు. ఒకసారి దక్షుడు నిరీశ్వర యాగం తలపెడతాడు. ఆ యాగానికి వెళ్ళొద్దని పిలువని పేరంటానికి పోవద్దని శివుడు చెప్పినా మాటను పెడచెవిన పెట్టిన పార్వతి నందిని వెంట తీసుకుని ఆ యాగానికి వెళుతుంది. యాగానికి వచ్చిన పార్వతిని దక్షుడు శివుడు శ్మశాన సంచారి అని బిక్షగాడని అవమానిస్తాడు. పతిని అవమానించడం సహించని పార్వతి యజ్ఞంలో దూకి ఆత్మాహుతికి పాల్పడుతుంది. ఇది చూసిన నంది పరుగున వెళ్ళి శివునికి ఈ విషయం తెలపడంతో ఆగ్రహించిన పరమ శివుడు ఉగ్రతాండవం చేసి తన జటాజూటం నుంచి జటాజూటాలను తీసి నేలకేసి కొడతాడు. ఈ జూటాల నుంచి వీరభద్రుడు ఉద్భవిస్తాడు. పట్టసం అనే ఆయుధంతో వెళ్లి దక్ష యజ్ఞం ధ్వంసం చేసి దక్షుని తల నరికి తెస్తాడు. సతీ వియోగంతో ఉగ్రరూపంలో తాండవం చేస్తున్న రుద్రుని ఆగ్రహ జ్వాలలకు భయపడిన వీరభద్రుడు పట్టసం అనే ఆయుధాన్ని విడిచి పెట్టడంతో ఆ ఆయుధం దేవకూట పర్వతంపై పడుతుంది. ప్రళయ తాండవం చేస్తున్న పరమేశ్వరుడిని అగస్త్యముని ఆయన జటాజూటాలను ముడి వేసి ఆలింగనం చేసుకున్నారని అందుకే పట్టిసీమ శివక్షేత్రంలో శివలింగానికి జటాజూటపు ముడి ఉంటుందని, శివలింగం చుట్టూ అగస్త్యముని చేతి ముద్రలు ఉంటాయని ఆ ఆనవాళ్ళు ఇప్పటికీ ఈ శివ క్షేత్రంలో చూపిస్తారు.

పట్టసమనే ఆయుధం పడ్డ ప్రాంతం కాబట్టి ఆ పర్వత ప్రాంతంలో వెలసిన శివక్షేత్రాన్ని పట్టసం అని పిలవడం ప్రారంభించారు. అది కాస్తా కాల క్రమేణా పట్టిసీమగా మారింది. వీరభద్రుడితోపాటు భూలోకానికి వచ్చిన మహానందీశ్వరుడు పట్టిసీమ శివక్షేత్రానికి మరి కొంత దూరంలో రామయ్యపేట గ్రామం (ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు నిర్మించిన ప్రాంతం)లో గోదావరి నది మధ్యన చిత్రకూట పర్వతంపై వెలిశాడు . అప్పటి నుంచి ఆ శివక్షేత్రం మహానందీశ్వర స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. స్వయంభుగా వెలసిన ఈ పురాతన పట్టిసీమ శివక్షేత్రాన్ని అప్పట్లో చోళ రాజులు పునర్నిర్మించగా తర్వాత రెడ్డి రాజులు, ఆ తర్వాత పోలవరం జమిందారులు కొచ్చర్లకోట వంశీకులు ఆలయ ధర్మకర్తలుగా, ట్రస్టీలుగా వ్యవహరిస్తు న్నారు.

ప్రతి ఏటా లింగోద్భవ పూజలు, తొలి పూజలు వారే నిర్వహిస్తారు. మహాశివరాత్రి పర్వదినాల్లో ఈ శివక్షేత్రాన్ని ఐదు లక్షలకు పైగా భక్తులు దర్శించుకుంటారు.



## నేడు సుందరగిరిపై సుదర్శన నృశింహ మహాయజ్ఞం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువుదీరిన శ్రీలక్ష్మీ నారసింహుని దివ్య సన్నిధిలో అతిరుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృశింహ మహాయజ్ఞం బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభం కానుంది. ఆలయ యాగశాలను పండితులు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ప్రధాన హోమగుండాన్ని ముగ్గులతో సుందరీకరించారు. మంగళవారం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి.యాగశాలలో మండపారాధన, నిత్యహోమం నిర్వహించారు. అంతకు ముందు మూలవిరాట్‌కు అభిషేకాలు జరిగాయి. అనంతరం శాలిగ్రామ అభిషేకాలు, పూజలు, అనంతరం శ్రీమహాగణపతి హోమాన్ని పండితులు, రుత్వికులు వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. యజ్ఞ నిర్వాహకులు కొచ్చర్లకోట నరసింహగురూజీ ఆలయ యాగశాలలో ప్రధాన హోమ గుండ ప్రతిష్ఠ నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినమైన ఈనెల 26 సాయంత్రం నుంచి తెల్లవార్లూ ఈ 31వ అతిరుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృశింహ మహాయజ్ఞం జరుగుతుందని భక్తులు తరలిరావాలని కోరారు.



గణపతి హోమం .. నృశింహస్వామికి పత్రి పూజ

# ప్రచారం ముగిసింది ఓటు మిగిలింది



- పట్టభద్రుల నియోజక వర్గాల్లో అంతా సైలెంట్
- ఆరోపణలు, విమర్శలకు దూరంగా ప్రచారం
- ప్రాధాన్యత ఓటు కోసమే అందరి పాట్లు..
- రేపు పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచార సమరం సాఫీగా ముగిసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో అటు తెలుగుదేశం నేతలు, ఇటు మిగతా పక్షాల నేతలు పట్టభద్రులను కలిసి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి నువ్వా నేనా అన్నట్టుగా ప్రచారం పూర్తి చేయగలిగారు. ఇప్పటికే నిరుద్యోగం తాండవిస్తుండగా పట్టభద్రులను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులంతా ప్రచారంలో చమటోడ్చారు. తమ కూటమి ప్రభుత్వం కారణంగానే పరిశ్రమలు రాబోతున్నాయని, మెగా డీఎస్సీతోపాటు యువతకు అనుకూలంగా ఉపాధి పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామనే హామీతో టీడీపీ బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా రెండు విడతలుగా ముఖ్య నేతలతో భేటీ నిర్వహించారు. యువనేత నారా లోకేశ్ కూడా ఎమ్మెల్సీ స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు ఏకపక్షంగా ఉండాలనే విధంగా ఉత్సాహపరిచారు. ఉమ్మడి ఉభయగోదావరిలో విభజిత ఆరు జిల్లాలు ఉండగా వీటన్నింటిలోనూ ప్రచారంలో తెలుగుదేశం పైచేయి సాధించగలిగింది. క్షేత్రస్థాయి కేడర్ దగ్గర నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, డైరెక్టర్లు, మునిసిపల్ ఛైర్మన్‌లు, ఎంపీపీలు దగ్గర నుంచి పార్లమెంటు సభ్యుల వరకు పట్టభద్రుల చుట్టూ పరిభ్రమించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఎక్కడా పట్టు జారకుండా పక్కాగా వ్యూహాత్మకంగానే ముందుకువెళ్ళారు. క్షేత్రస్థాయిలో ఉన్న పట్టభద్రులను కలిశారు. వీరంతా పోలింగ్ కేంద్రానికి వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రచారంలో పెద్దగా పార్టీల మధ్య వివాదాలు సృష్టించే వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తలు పడ్డారు. కూటమి పక్ష ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో ఓటర్ల మద్దతుకు విశ్వ ప్రయత్నం చేశారు.

### చూసి.. ఓటేయండి

పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు పక్షాన వివిధ పార్టీల నేతలు ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాన్నాళ్ళైనా ఇచ్చిన హామీలు నెరవేర్చుకోవడంలేదంటూ పట్టభద్రులకు వివరించి వారి మద్దతు పొందేందుకు ప్రయత్నించారు. శాసన మండలిలో ప్రజల పక్షాన గొంతు వినిపించేలా తమకు ఓటు వేయాలని మిగతా అభ్యర్థులు ఎవరంతట వారుగా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. మాజీ ఎంపీ హర్షకుమార్ సైతం వివిధ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ తన కుమారుడు జీ.వి.సుందర్ పక్షాన ప్రచారం చేస్తూ టీడీపీపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. వైసీపీ మాత్రం లోతట్టుగా కూటమికి వ్యతిరేకంగా ఓట్లు వేయాల్సిందిగా తమ పార్టీ అనుకూల వర్గాలను ఇప్పటికే కోరింది. మండల స్థాయిలో కొందరు జోక్యం చేసుకుని ఈ విధంగా పరోక్ష ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకించి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య భారీగానే ఉన్నా ప్రచార శైలిలో మాత్రం ఎవరంతట వారుగానే వ్యవహరించారు.

**జిల్లాల వారీగా ఓటర్ల తుది జాబితా**

| జిల్లా | పోలింగ్ కేంద్రాలు | పురుష ఓటర్లు | మహిళా ఓటర్లు | ట్రాన్స్ జెండర్ | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|---|
| అల్లూరి జిల్లా | 12 | 2,842 | 1827 | 0 | 4669 |
| కోనసీమ జిల్లా | 95 | 37,114 | 27,355 | 2 | 64,471 |
| తూ.గో. జిల్లా | 92 | 36,361 | 26,606 | 3 | 62,970 |
| ఏలూరు జిల్లా | 66 | 24,704 | 17,571 | 7 | 42,282 |
| కాకినాడ జిల్లా | 98 | 42,463 | 28,072 | 5 | 70,504 |
| ప.గో. జిల్లా | 93 | 39,863 | 30,187 | 2 | 70,052 |
| మొత్తం | 456 | 1,83,347 | 1,31,618 | 19 | 3,14,984 |

### ఉద్యోగ వర్గాలు ఏవైపు

ఈసారి పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్లుగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఎవరైనా ఎన్నికల విధుల్లో ఉంటే వారికి పోస్టల్ ఓటుకు అవకాశం ఇస్తారు. మిగతా వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఇప్పటికే ఉద్యోగులంతా తమ పక్షానే ఉన్నారని కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల వరకు వెళ్ళి తమ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఎలాగూ సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా ఉభయగోదావరి జిల్లాల్లో కూటమి పక్షానికి చెందిన వారే కావడంతో ఉద్యోగులు కూడా ఎక్కడా వ్యతిరేకత ప్రదర్శించకుండా ఇప్పటిదాకా జాగ్రత్తపడ్డారు. కూటమి ఊహిస్తున్నట్టుగా వీరందరి మద్దతు ఆ వైపే దక్కితే భారీ మెజార్టీ తథ్యమని అంచనా వేస్తున్నారు. ఇంకోవైపు కార్మికులు, ఇతర వర్గాల్లో కూడా ఈ ఎన్నిక పట్ల పెద్దగా ఆసక్తి లేకపోయినా క్షేత్రస్థాయిలో నేతల హడావుడితో పోలింగ్ కేంద్రం వరకు వెళ్ళాల్సిన పరిస్థితి ఉంది.

### నంబర్-1 కోసమే ఆరాటం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్‌పై ప్రాధాన్యత ఓటు ఒకటిగా ఎవరికి అత్యధికంగా లభిస్తుందో వారే చివరికి విజేతలవుతారు. దీంతో గడిచిన మూడు రోజులుగా ప్రాధాన్యత ఓటు ఒకటి తమకే వేయాలని, బ్యాలెట్‌లో మరెవరికీ ఈ సంఖ్యతో ఓటు వేస్తే చెల్లకుండా పోతుందంటూ మరీ ఓటర్లను చైతన్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తుండడంతో మొదటి ప్రాధాన్యత ఓటును ముందస్తుగా లెక్కిస్తారు. దీనిలో ఎవరైతే అత్యధికంగా ముందు వరుసలో ఉంటారో వారికే ఛాన్స్ దక్కడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే గడిచిన ఎన్నికల్లోను, అంతకుముందు జరిగిన ఎన్నికల్లోను ప్రాధాన్యత ఓటు విషయంలో ఓటర్లు తడబడడంతో చెల్లని ఓట్లు వేల సంఖ్యలోనే నమోదయ్యాయి. ఒక్క 2019లో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అప్పట్లో 13 వేలకుపైగా ఓట్లు చెల్లకుండా పోయాయి. ప్రాధాన్యత ఓటు విషయంలో ఒకరి కంటే మించి ఎవరికైనా నమోదు చేస్తే చెల్లదని అప్పట్లో చైతన్యపర్చకపోవడం వలనే వేల ఓట్లు మురిగిపోయాయి. ఇప్పుడు తెలుగుదేశం దీనిని గమనించి తమ పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పేరు బ్యాలెట్‌లో వరుస సంఖ్య ఒకటిలో ఉండడం, ఓటర్లు కూడా దీనికి అభిముఖంగా ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్నుతో ఒకటి(సంఖ్య రూపంలో) నమోదు చేస్తే చాలంటూ ఇప్పటికే ప్రచారంలో హోరెత్తించారు. మిగతా అభ్యర్థులు కూడా తమకు ప్రాధాన్యత ఓటు ఇవ్వాల్సిందిగా పదేపదే ఓటర్లను ప్రసన్నం చేసుకునే విధంగా వ్యవహరించారు.

## పాఠశాలలకు సెలవు

ఏలూరు అర్బన్/భీమవరం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకుని ఉపాధ్యాయులందరూ తమ ఓటుహక్కుని వినియో గించుకునేందుకువీలుగా ఈ నెల 27న అన్ని పాఠశాలలకు ఎన్నికల సంఘం సెలవు ప్రకటించినట్టు అధికారులు తెలిపారు. అదే విధంగా 26న ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలకు ఏర్పాట్ల నిమిత్తం ముందు రోజు అనగా 26 కూడా స్థానిక సెలవుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. అందరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## హెల్ప్‌లైన్ నంబర్లు

ఏలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల నియోజకవర్గంలోని ఓటర్ల సౌలభ్యం నిమిత్తం హెల్ప్ లైన్ నంబర్ 1950 లేదా 94910 41419 నంబర్లను ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినట్టు రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. హెల్ప్‌లైన్ నంబర్లను ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఓటర్లు వినియో గించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటెయ్యండి

» ఏలూరు జిల్లా కలెక్టర్, ఆర్వో వెట్రిసెల్వి

ఏలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు జరుగుతుం దని, ఓటు హక్కు కలిగిన పట్టభద్రులంతా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి సూచించారు. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, పోలింగ్ కేంద్రానికి తగిన గుర్తింపు పత్రంతో వెళ్లి అధికారులకు చూపించి ఓటెయ్యాలన్నారు. ఓటరు గుర్తింపు ఉన్న పత్రంపై ఓటరు పేరు వద్ద సంతకం చేస్తే అనంతరం బ్యాలెట్ పేపర్ అందిస్తారన్నారు. ఇందులో అభ్యర్థుల పేర్లు, ఫొటోలే ఉంటాయని, ప్రాధాన్యతా క్రమంలో అధికారులు ఇచ్చిన పెన్‌తో ఓటెయ్యాలని ఆమె సూచించారు. అంకెలు మాత్రమే అభ్యర్థులకు వేయాలన్నారు. ఓటింగ్‌కు వెళ్లేటప్పుడు ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు పత్రం వెంట పట్టుకెళ్లాలన్నారు.

### జోనల్ అధికారుల పాత్ర కీలకం

ఎమ్మెల్సీ ఎన్నికలకు రిసెప్షన్ సెంటర్ విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఇందులో జోనల్ అధి కారుల పాత్ర కీలకమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె వెట్రిసెల్వి అన్నారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో రిసెప్షన్ సెంటర్‌లో




విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ 27న పోలింగ్ ముగిసిన వెంటనే రిసెప్షన్ సెంటర్లలో పోలింగ్ సామగ్రి స్వీకరణ ప్రక్రియను అత్యంత శ్రద్ధతో నిర్వర్తించాలని, ఇక్కడకు చేరే బ్యాలెట్ బాక్సులతో పాటు, అక్కౌంట్ ,పీవో డైరీ, పేపర్ సీల్ అక్కౌంట్, ఇతర డిక్లరేషన్ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.

### పోస్టులో బ్యాలెట్ పత్రాల పంపిణీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది ఎవరైతే పోస్టల్ బ్యాలెట్‌కు ఫారం-12తో దరఖాస్తు చేసుకున్నారో వారికి బ్యాలెట్ పత్రాలను పోస్టు ద్వారా మీ చిరునామాలకు పంపామని పోస్టల్ నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ తెలిపారు. నిర్దేశించిన రీతిలో ఓటు హక్కును వినియోగించుకుని, వారి పోస్టల్ బ్యాలెట్‌ను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్, తూర్పు-పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం, ఏలూరుకు మార్చి 3వ తేదీ ఉదయం 7.59 గంటల్లో పోస్టుద్వారా లేదా స్వయంగా గానీ తప్పనిసరిగా అందేటట్లు పంపాలన్నారు.

### కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికలకు

కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఏలూరు జిల్లాలో 8 మండలాల్లో 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గ పరిధిలో 16,099 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 150 మందిని ఎన్నికల సిబ్బందిని నియమించారు. పోలింగ్‌కు 80 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు.నూజివీడులో ఈనెల 26న నూజివీడు సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ద్వారా ఎన్నికల సామాగ్రిని అందజేస్తారు.

### ఏలూరు జిల్లాకు ఇలా ..

ఏలూరు జిల్లాలో 66 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని ఈ నెల 26న ఉదయం కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్ నుంచి, జంగారె డ్డిగూడెం ఆర్డీవో కార్యాలయాల నుంచి పంపిణీ చేస్తారు. జిల్లాలో 217 బ్యాలెట్ బాక్సులను కేటాయించారు.

## పట్ట భద్రులు ఎక్కడ

**జల్లెడ పట్టిన కూటమి నేతలు**

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నేతలు పట్టుబిగించారు. పట్ట భద్రుల ఓటర్లను గుర్తించి పనిలో నిమగ్నమయ్యారు. గడచిన కొన్ని రోజులుగా కూటమి శ్రేణులు ఇదే పనిలో ఉన్నాయి. కూటమి అధిష్ఠానం కూడా ప్రచారశైలిపై ఆరాతీస్తూ వచ్చింది. ప్రచారానికి దూరంగా ఉన్న నేతలను, ప్రజాప్రతినిధులను గుర్తించింది. ప్రచారం ఇప్పటిదాకా కూటమి నేతలు ముందంజలో ఉన్నారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, బ్యాంకులు ఇలా పట్టభద్రుల పనిచేసే ప్రతి సంస్థను సందర్శించారు. పట్టభద్రులను కలుసుకున్నారు. మరోవైపు ఓటర్లుగా నమోదైన పట్టభద్రుల ఫోన్ నెంబర్‌లను సేకరించారు. తద్వారా ప్రతి ఒక్కరికీ ఫోన్‌లు చేశారు. ఓటర్లను అభ్యర్థించారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఓటర్లను గుర్తించి నేరుగా సంప్రదించిన జాబితా విషయంలోనూ కూటమి అధిష్ఠానం నివేదిక సేకరించింది. ఉభయగోదావరి జిల్లాల్లో నియోజకవర్గాల వారీగా ర్యాంకులను ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒక్కరోజు ఎన్నిక ఉన్నందున ఏమరుపాటు వద్దంటూ నేతలకు కర్తవ్య బోధ చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులను రప్పించేందుకు క్షేత్ర స్థాయిలో నాయకులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు వామపక్షాలు సైతం తమ ప్రయత్నాలు సాగించారు. స్వతంత్ర అభ్యర్థులు లఘు సందేశాలు., వాట్సాప్ వీడియోల ద్వారా ప్రచారం చేశారు. ఓటర్ల మనోభావాలను తెలుసుకోవడానికి సర్వే సంస్థలు ప్రయత్నాలు చేశాయి.

## రైతులకు చేయూతగా 'నీటి సంఘాలు'

**పూడుకు పోయిన కాలువల తవ్వకం పనులకు శ్రీకారం**

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పంట కాలువలకు మళ్లీ పునరుజ్జీవం లభించింది. పూడుకుపోయిన చానల్స్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో పనులకు శ్రీకారం చుట్టారు. నిన్న మొన్నటి వరకు నీరులేకబోసిపోయిన చానల్స్ ప్రస్తుతం సాగునీటితో కళకళలాడుతున్నాయి. వైసీపీ పాలనలో కాల్వల్లో కనీసం తట్టమట్టి తీయని కారణంగా తీరప్రాంతంలో సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు, నేతల వద్దకు వెళ్లినా పట్టించుకునే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి రైతులకు మరింత దగ్గర చేర్చింది. ఆయా కాల్వల పరిధిలోని సాగునీటి సంఘం అధ్యక్షులు దాళ్వాలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని తొలగించేందుకు పంట కాలువలు, సబ్ చానల్స్‌ను ఆధుని కీకరిస్తున్నారు. మండలంలోని శేషావతరం చానల్స్‌తో పాటు పసలదీవి, మొగల్తూరు పరిధి లోని చానల్స్‌ను శుభ్రం చేయిస్తున్నారు. రెండు రోజులుగా చేపడుతున్న పనుల్ని జిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు గుబ్బల మాధ్రాజు, నీటి సంఘం అధ్యక్షుడు కడలి మోహన్ పర్యవేక్షిస్తు న్నారు. విప్ నాయకర్ ఆదేశాలకు అనుగుణంగా రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా ఉండేం దుకు ముందస్తుగా పనులు చేపడుతున్నట్టు వారు తెలిపారు.

## నరసాపురం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

నరసాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని పరిగణనలోకి తీసుకుని నరసాపురం-చర్లపల్లి మధ్య ఈనెల నుంచి మార్చిలో ప్రతి శుక్ర, ఆదివారాల్లో ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్టు స్టేషన్ మేనేజర్ మధుబాబు తెలిపారు. 07233 నంబరుతో ఈనెల 28, మార్చి 7, 13, 21, 28 తేదీల్లో చర్లపల్లి నుంచి నరసాపురానికి రాత్రి 8.15 గంటలకు ప్రత్యేక రైళ్ల బయలుదేరుతాయన్నారు. నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, కైకులూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు మీదుగా ఉదయం ఐదు గంటలకు నరసాపురం చేరుతుందన్నారు. తిరిగి 07234 నంబరుతో మార్చి 2,9, 16, 23, 31 తేదీల్లో నరసాపురంలో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం చర్లపల్లి చేరుతుందన్నారు.

## సివిల్ సప్లయ్స్ డీఎం బదిలీ

భీమవరం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమగోదావరి జిల్లా సివిల్ సప్లయ్స్ డీఎంగా పనిచేస్తున్న టి.శివరామ ప్రసాద్‌కు బదిలీ అయింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవోఆర్‌టి నెం 408 పేరిట విడుదలైన జీవోలో ఈ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ పి ప్రభాకర్‌ను జిల్లా సివిల్ సప్లయ్స్ డీఎంగా నియమించారు.



## వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అనుమానాస్పద మృతి

హోంగార్డు..

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఒక హోంగార్డు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విధులను నిర్వర్తిస్తూనే ఉన్నాడు. అతను ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో అనుమానాస్ప దంగా యూనిఫాంతో మృతి చెంది ఉన్నాడు. ఏలూరు జిల్లా హోంగార్డు విభాగంలో పని చేస్తున్న పెద్దిబోయిన రమేష్ (39) ఇటీవల త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేశాడు. అనంతరం జిల్లా హోంగార్డు ఆఫీస్‌లోనే రిపోర్టు చేశారు. అతనికి భార్య స్వాతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు గుడివాడలో ఉంటు న్నారు. రమేశ్ హోంగార్డు డార్మెటరీలో ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నాడు. పట్టిసీమ బందోబస్తు వేయడంతో అక్కడికి వెళ్ళడానికి ఈనెల 25వ తేదీ ఉదయం బయలుదేరాడు. అతను ఫైర్ స్టేషన్ వద్దకు వచ్చేటప్పటికి ఛాతి నొప్పి రావడంతో పక్కనే ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కు వెళ్ళి కూలబడిపోయాడు. ఆ సంఘటన చూసి పలువురు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు, టూటౌన్ ఎస్ఐ నాగకల్యాణి, వారి సిబ్బంది వచ్చి పరిశీలించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై పోలీ సులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఎలక్ట్రీషియన్..

భీమవరం క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఒకటవ పట్టణ పరిధిలోని చినఅప్పారావు తోటకు చెందిన పులపర్తి బాలాజీ (37) ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. మొగల్తూరు మండలం నీటితిప్పకు చెందిన మృతుడికి ఏడేళ్ళ క్రితం వివాహమయ్యింది. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ భీమవరంలో నివాసముంటున్నారు. ఇటీవల జూదంలో ఆర్థికంగా నష్టపోగా కుటుంబ సభ్యులు అతని అప్పులు తీర్చారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చి వేరొక గదిలో ఒంటరిగా పడుకున్నాడు. తెల్లారి చూసేసరికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కిరణ్‌కుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

అమ్మమ్మతో గొడవపడి..

పెదవేగి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : అమ్మమ్మతో గొడవపడి కుప్పకూలి మృతిచెందిన సంఘటన పెదవేగి మండలం రాయన్నపాలెంలో జరిగింది. ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. బి.సింగవరం గ్రామానికి చెందిన పలగాని ఉదయ్‌కుమార్‌కు అదే గ్రామానికి చెందిన తేజశ్రీతో ఐదేళ్ళ కిందట వివాహమైంది. కాగా కుటుంబ విషయమై ఉదయకుమార్ సోమవారం రాత్రి రాయన్నపాలెంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్ళి ఆమెతో ఘర్షణ పడ్డాడు. కొద్దిసేపటికి గుండెపట్టుకుని కుప్పకూలాడు. వెంటనే అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తలరించారు. అప్పటికే ఉదయ్‌కుమార్(23) మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తన భర్త మృతికి కారణం అతని అమ్మమ్మ, వారి కుటుంబ సభ్యులే కారణమని మృతుని భార్య తేజశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం సస్పెన్షన్

ఏలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం రెడ్డిపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఆదేశాలు జారీ చేసినట్లు మంగవారం ఎంఈఓ-1 బి.రాముడు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, మత పరమైన వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేయడంతో ఈ నెల 13న పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు హెచ్‌ఎం పై చర్యలు తీసుకోకపోవడంతో ఈ నెల 24వ తేదీ కూడా పాఠశాల వద్ద తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దారు, ఎంఈఓ లు పాఠశాల వద్దకు చేరకుని విచారణ చేసి నివేదిక జిల్లా విద్యాశాఖాధికారికి నివేదించగా ఆమె అదే రోజు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యంను సస్పెండు చేశారు. మంగళవారం ఎంఈవోలు బి.రాముడు, జి.రాములు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యంకు సస్పెన్షన్ ఆర్డరును అందచేసినట్లు తెలిపారు.

## ఇద్దరు లైన్‌మెన్‌లపై పోలీసులకు ఫిర్యాదు

ఆకివీడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌మెన్లు పట్టణ పరిధిలో వినియోగదారులు దగ్గర రూ.1,99,653 బిల్లులు కట్టించుకొని డిపార్ట్‌మెంట్‌కు చెల్లించకుండా మోసం చేశారని ఏఈ ప్రదీప్ ఫిర్యాదు మేర ఎస్ఐ హనుమంతు నాగరాజు కేసు నమోదు చేశారు. విద్యుత్ లైన్‌మెన్ జి.స్టాలిన్, జూనియర్ లైన్‌మెన్ వి.రమేష్ గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించి వినియోగదారుల దగ్గర బిల్లులు కట్టించుకున్నారు. అయితే డిపార్ట్‌మెంట్‌కు చెల్లించకపోవడంతో అధికారులకు పలు ఫిర్యాదులు చేశారు. ఈ ఏడాది జనవరిలో విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలో భాగంగా ఫిర్యాదులు గుర్తించడంతో స్టాలిన్‌ను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి రమేష్ కనపడకుండా పోయాడు. మంగళవారం పోలీసులకు ఏఈ ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

## భార్య, అత్తపై కొడవలితో దాడి

ఉండి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):భార్య, అత్తలపై కొడవలితో భర్త దాడిచేసి గాయపరిచిన సంఘటన ఇది. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. ఉండికి చెందిన భావన సురేశ్‌కు ఆరేడు గ్రామానికి చెందిన పెరికల నాగదేవితో 10ఏళ్ల క్రితం ప్రేమ వివాహమైంది. వీరికి ఇరువురు సంతానం. సంక్రాంతి సమయంలో ఆటోతో ఢీకొట్టిన సంఘటనలో సురేశ్ కేసులో ఇరుక్కున్నాడు. అప్పటి నుంచి భార్యభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో నాగదేవి తన ఇరువురు కుమారులను తీసుకుని ఆరేడులోని తన తల్లి వద్దకు వెళ్లింది. భార్యపై భర్తకు అనుమానం రావడంతో ఆమెతో మాట్లాడటానికి అక్కడకు వెళ్లాడు. ఇరువురు మధ్య మాటలు పెరిగి గొడవ జరిగింది. దాంతో ఆవేశంలో అక్కడే ఉన్న కొడవలిని తీసుకుని భార్యపై దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వెళ్లిన అత్తపై కూడా దాడి చేయడంతో ఇరువురు గాయపడి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

## గంజాయి కలిగి ఉన్న ఇద్దరి అరెస్టు

**రెండు కిలోల 335 గ్రాముల గంజాయి స్వాధీనం**

ఏలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో గంజాయితో ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ కృష్ణబాబు తెలిపారు. పట్టణంలోని రామచం ద్రాపురం సమీపంలోని పిరమిడ్ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారని తమకు అందిన ఫిర్యాదు మేరకు దాడి చేశామన్నారు. ఈ దాడిలో తుంపాల సాయి, శివరాత్రి దుర్గాప్రసాద్‌ల వద్ద రెండు కవర్లలో ప్యాక్ చేసిన గంజాయిని గుర్తించి నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి 2కిలోల 335 గ్రాముల గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్, పల్సర్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను మంగళవారం రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి ఎస్ఐ శశాంక, సిబ్బంది పాల్గొన్నారు.

### ట్రాక్టర్ క్రింద పడి డ్రైవర్ మృతి

లింగపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధజ్యోతి): ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన లింగపాలెం మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలం ముసునూరు గ్రామానికి చెందిన బడిపాటి అగస్టీన్(50) లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం గ్రామంలో మొక్కజొన్న కంపెనీ వద్దకు 24తేదీ రాత్రి ట్రాక్టర్‌లో మొక్కజొన్న దిగుమతికి తీసుకు వచ్చాడు. ట్రాక్టర్‌లు ఎక్కువగా ఉండటంతో తన ట్రాక్టర్‌ను పక్కనపెట్టి దాని ట్రక్కు కింద పడుకున్నాడు. వెనుక నుంచి వచ్చిన లారీ రివర్స్ చేస్తూ ట్రాక్టర్‌ను ఢీకొట్టగా ట్రాక్టర్ ముందుకు కదలడంతో ట్రాక్టర్ చక్రాలకింద నలిగిపోయినట్లు తెలిపారు. అక్కడ ఉన్న వారు గమనించి వెంటనే చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించినట్లు తెలిపారు. మృతుని భార్య మార్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 8న ఉమ్మడి జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మార్చి 8వ తేదీన అన్ని కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025వ సంవత్సరానికి మొదటి జాతీయ లోక్‌అదాలత్ మార్చి 8వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 10 మండల లీగల్ సర్వీసెస్ కమిటీలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహిస్తుందన్నారు. కక్షిదారులు జిల్లా లేదా మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి తమ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

## గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు చెప్పారు. వచ్చేనెల మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీన ఉంటుందని తెలిపారు.

## నేడు స్పటిక లింగానికి పంచామృతాభిషేకం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఏలూరు వై.ఎం.హెచ్.ఏ ప్రాంగణంలో పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగున్నర నుంచి కాశీమహా క్షేత్రం నుంచి తీసుకొచ్చిన స్పటిక లింగానికి కుంభమేళా నుంచి సేకరించిన పవిత్ర జలంతో పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నట్టు వైఎంహెచ్ఏ సభ్యులు తెలిపారు. సాయంత్రం నాట్యాచార డి.హేమసుందర్ శిష్య బృందంచే, గండికోట రాజేష్ బృందంచే నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను గెలిపించుకోవాలి : సారథి

కామవరపుకోట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చా రు. మంగళవారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పట్టభ ద్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాజశేఖరం గెలుపు ద్వారా రెండు జిల్లాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్రశేషు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, బీజేపీ మండలాధ్యక్షులు బాలవర్ధిరాజు పాల్గొన్నారు.



# శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



కామవరపుకోట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : శివరాత్రిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శివాలయాలను ఇప్పటికే విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అలాగే తాత్కాలిక పందిళ్ళు, భక్తులకు ప్రవేశ మార్గాలు, అభిషేకాలు, బిళ్వార్చనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు నిర్వహించారు. ఈ మేరకు కామవరపుకోటలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, ఆడమిల్లిలోని శనీశ్వరాలయం, ఏకాంబరేశ్వరాలయం, తడికలపూడిలోని గాంగేశ్వరాలయం, జీలకర్రగూడెంలోని ధర్మలింగేశ్వర ఆలయం, రావికంపాడులోని శివాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. తాడిచర్లలోని దుర్గామల్లేశ్వరాలయం వద్ద ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

**ఉంగుటూరు :** ఉంగుటూరు మండలంలోని ఉంగుటూరు భీమేశ్వరాలయంలోను, కాగుపాడు, కైకరం,గొల్లగూడెం కంసాలిగుంట శివాలయాల్లో బుధవారం తెల్లవారు జామునుంచే స్వామి వారి దర్శనానికి దేవదయ ధర్మదాయ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**కొయ్యలగూడెం :** శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అంకాలగూడెం, బయ్యన్నగూడెం, కన్నాపురం, యర్రంపేట శివాలయాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక దీపాలంకరణ చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తుల తాకిడి ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**ఏలూరుకార్పొరేషన్ :** మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు దక్షిణపు వీధిలోని మార్కండేయస్వామి, జరాపహరేశ్వరస్వామి, అగ్రహారంలోని నగరేశ్వరస్వామి, పాత శివాలయం, గాంధీనగర్‌లోని అవిముక్తేశ్వరాలయం, పత్తేబాదలోని రామలింగేశ్వరాలయం, పవరుపేట, బావిశెట్టివారిపేట, నాగేశ్వరపురంలలోని కాశీ విశ్వేశ్వరాలయాలు, సత్యనారాయణపేటలోని రేవు లింగేశ్వరాలయం, మినీ బైపాస్ రోడ్డులోని విశ్వంభరేశ్వరస్వామి ఆలయం, శివనగర్‌లోని మల్లికార్జున ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా శివాలయం అర్చకులు వి.వెంకటేశ్వరశర్మ మాట్లాడుతూ ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

## తక్షణమే రహదారి పనులు చేపట్టాలి

కుక్కునూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):కుక్కునూరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి డిమాండ్ చేశారు. మంగళవారం కుక్కునూరులో విలేకర్లతో మాట్లాడుతూ రహదారి నిర్మాణం పనులు మధ్యలోనే వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చేపట్టకపోతే ఆందోళనలు మరింత తీవ్రం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కొన్నే లక్ష్మయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోస్టాండ్ తొలగించడం అన్యాయం


ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్‌ను తొలగించడం అన్యాయమని ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏ.గోపి వాపోయారు. ఆటో స్టాండ్‌ను తొలగించినందుకు మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద డ్రైవర్లు మంగళవారం బైఠాయించారు. అక్కడి నుంచి తమను వెళ్లగొడితే తమ జీవితాలు, కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు తమకు అక్కడే ఆటోస్టాండ్ కొనసాగించాలని కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

## దాచారం గోదావరి తీరంలో బోట్లు ఏర్పాటు చేయాలని వినతి

కుక్కునూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దాచారం గోదావరి తీరానికి అవతలవైపు ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి వెళ్లడానికి గోదావరిపై లాంచీ, పడవలు ఏర్పాటు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దశాబ్దాల కాలంగా శివరాత్రి రోజున కుక్కునూరు వేరుపాడు మండలాలకు చెందిన భక్తులంతా గోదావరి దాటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్తుంటారని భక్తులను దృష్టిలో పెట్టుకుని లాంచీ పడవ ఏర్పాటు చేయాలని తాహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

## ఎమ్మెల్యే బాలరాజు రూ.లక్ష విరాళం

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):జీలుగుమిల్లి గ్రామ ఇలవేల్పు జగదాంబ 68వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయం వద్ద ఉత్సవాల నిర్వహణకు తనవంతుగా రూ.లక్ష విరాళం అందజేశారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు ఉన్నారు.

## అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ

లింగపాలెం, ఫిబ్రవరి 25(ఆంధజ్యోతి): విద్యా వ్యవస్థలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని బాలలు నూతన అంశాలు నేర్చుకునేలా వారికి బోధించాలని ఐసీడీఎస్ సీడీపీవో మాధవి అన్నారు. మండలంలోని సింగగూడెం హైస్కూల్లో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీలు చిన్నారులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.శ్రీధర్, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వ్యాను అద్దం ధ్వంసం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో ద్విచక్ర వాహనదారుడు వ్యాను డ్రైవర్‌పై దుర్భాషలాడాడు. ఇటుక రాయితో వ్యాను అద్దం పగులగొట్టాడు. దీంతో బాధితులు ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండవల్లి మండలం పులపర్రు గ్రామానికి చెందిన బలే రఘువర్మ, అతని కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి బలివే తిరునాళ్ళకు వెళ్తుండగా సెయింట్ ఆన్స్ కాలేజీ సమీపంలో ఏపీ 37డిఎస్ 8562 స్కూటర్‌పై వచ్చి వీరితో గొడవ పడ్డాడు. దీంతో బాధితుడు రఘువర్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

## యువతి చేతిలోని ఐ ఫోన్ చోరీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలకు చెందిన మువ్వా తనూజ స్కూటర్‌పై వెళ్తుండగా ఫోన్ రావడంతో పక్కనే బండి ఆపింది. ఫోన్ తీసి మాట్లాడేలోపు ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపే ప్రయత్నం చేయగా ప్రతిఘటించింది. అంతలో ఆమె చేతిలో ఉన్న ఖరీదైన ఐ ఫోన్‌ను లాక్కుని బైక్‌పై ఉడాయించారు. ఈ సంఘటనపై బాధితురాలు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో హైవేపై ప్రయాణించాలంటేనే ద్విచక్ర వాహనదారుల్లో భయాందోళనలు రేకెత్తుతున్నాయి. చోరీల కట్టడికి పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.





## ఆగిరిపల్లి చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లిలోని హ్యాపీ వ్యాలీ స్కూల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఏలూరు శనివారపుపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు బహుమతులు సాధించారని హెచ్ఎం జి.ప్రకాశరావు తెలిపారు. 500 మంది విద్యార్థులు హాజరైన ఈ పోటీల్లో తమ స్కూల్ నుంచి యతిక్‌రత్న, హర్ష, రుద్ర, తేజశ్రీ, ఆకాశ్, శరత్, నవీన్‌కుమార్, యమున, షణ్ముకప్రియ, గాయత్రి, వైష్ణవి, సాయి కీర్తన, నాగరాజు విజేతలుగా నిలిచారని వివరించారు. వీరిని స్కూల్ డ్రాయింగ్ టీచరు ఎండీ ఇర్షాద్ అహ్మద్, ఎస్ఎంసీ చైర్మన్ రాజ్‌కుమార్ అభినందించారు.

## 'ముందస్తు అడ్మిషన్లను నిలుపుదల చేయాలి'

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని నేతృత్వంలోని విద్యార్థుల బృందం మంగళవారం ఆర్ఐవో కె.యోహాన్‌కు వినతిపత్రం అందజేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తికాకముందే వచ్చే విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు తీసుకోవడం చట్ట విరుద్ధమన్నారు. అదే విధంగా ట్యూషన్ ఫీజు చెల్లించలేదన్న సాకుతో కళాశాలల యాజమాన్యాలు హాల్ టిక్కెట్లు జారీ చేయకుండా విద్యార్థులను వేధించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘ నగర అధ్యక్షుడు యశ్వంత్, మహేష్, వెంక టేష్, తదితరులు పాల్గొన్నారు.

## బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలి

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యం పెంచేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్ కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పర్సనలైజ్డ్ అడాప్షన్ లెర్నింగ్(పాల్)పై టీచర్లకు, ప్రిన్సిపాల్స్‌కు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ 'పాల్' కో-ఆర్డినేటర్ కిషోర్‌బాబు, జిల్లా డీఎస్‌వో శ్రీహరి, డీవైఈవో రవిప్రకాశ్, ఎంఈవోలు రమణ, ఏఎంవో రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## జానపద సంస్కృతి, సాహిత్యాలను పరిరక్షించుకోవాలి

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : జానపద సంస్కృతి, సాహిత్యాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆంధ్రా విశ్వకళా పరిషత్ ఆచార్యులు డాక్టర్ సీతారత్నం పిలుపునిచ్చారు. జానపద సంస్కృతి - సాహిత్యం అనే అంశంపై మంగళవారం ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. విశాఖపట్నం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల హిందీ రీడర్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి మాట్లాడుతూ స్థానిక వాతావరణంతో జానపద సంస్కృతి బలంగా ముడిపడి ఉందని, ఇవి సామాజిక విలువలను ప్రతిబింబింపజేస్తాయన్నారు. కళాశాల సుపీరియర్ ఎం.ఎ.ఫెర్నాండెజ్, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్.వి.మహాలక్ష్మి, అరుణ, ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

## 'ఇంటర్ విద్యార్థినులకు హాల్ టిక్కెట్లు ఇస్తున్నాం'

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఫీజులిస్తేనే హాల్ టిక్కెట్లను ఇస్తున్నామని తమపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్ తెలిపారు.ఆర్ఐవో యోహాన్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ కళాశాల ఆస్తులను ధ్వంసం చేసిన వారి నుంచి వంద రూపాయల అపరాధరుసుం వసూలు చేస్తున్నామని అన్నారు. అంతే తప్ప హాల్ టిక్కెట్లను ఇవ్వడంలేదన్న ఆరోపణ పూర్తిగా అసత్యమన్నారు. హాల్ టిక్కెట్లను విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిన విషయాన్ని వివరించారు.

## దివ్యాంగులు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలి

పెదవేగి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం, సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుందని ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పెదవేగి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ తరగతుల్లో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సభ్యులు పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమా నికి ప్రభుత్వం ప్రత్యేక హక్కులు కల్పించిందని, వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ అదనపు సీడీపీవో ఎం.సునీల్ రాజశేఖర్, సూపర్‌వైజర్లు సీహెచ్.పార్వతి, కె.మేరీబాయి, కె.శాంతకుమారి,రీసోర్స్ పర్సన్లు ఎం.లక్ష్మీనారాయణ, నవీన్ కుమార్, ఫాతిమా పాల్గొన్నారు.

## ఏకాదశ 11వ వార్షిక మహోత్సవాలు ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యనారాయణపేట కాలువ గట్టుపై ఉన్న గంగా పార్వతీ సమేత రేవు లింగేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాశీ అన్నపూర్ణ అమ్మవారికి 101 కిలోల బియ్యంతో తండులాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం జరిపారు. ఆలయ యాజ్ఞీక బ్రహ్మ వీరుభోట్ల కృష్ణశర్మ, ప్రధాన అర్చకులు వీరుభోట్ల వెంకటేశ్వరరావు శర్మలు భక్తులతో పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపించారు. బుధ, గురువారాలు వార్షికోత్సవ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు.

## అరసం ఆధ్వర్యంలో సాహిత్యంపై సమావేశం

చింతలపూడి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):విశిష్ట కవులు, రచయితలైన దాశరథి, ఆరుద్రల శత జయంతి సందర్భంగా అరసం ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేటు హోటల్లో సాహిత్య సమాలోచన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరసం రాష్ట్ర కార్యదర్శి బి.నాగార్జున సాగర్ దాశరథి గురించి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొనడమే కాకుండా నైజాం నవాబు దుశ్చర్యల గురించి నిజామాబాద్ జైలు గోడల మీద లిఖించారని పేర్కొన్నారు. సాహితీ స్రవంతి స్థానిక నాయకులు సూర్యకుమార్ ఆరుద్ర గురించి మాట్లాడుతూ సినీ గీతాలు, రచనలు ఎన్నో రాశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అబ్బిరెడ్డి రాహుల్, బి.ఎస్.ప్రసాద్, పి.ముత్తారెడ్డి, పి.సర్వేశ్వరరావు, జి.విక్రం, శేషగిరిరావు, పలువురు పాల్గొని మాట్లాడారు.

## పొగాకు కార్మికుల వేతనాల పెంపునకు అంగీకారం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):పొగాకు పనిచేసే కార్మికులకు ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి 2027 ఫిబ్రవరి 28 వరకు రెండు సంవత్సరాల కాలం పాటు వేతనాలు పెంచేందుకు మంగళవారం అగ్రిమెంట్ జరిగింది. పొగాకు కార్మిక సంఘ నాయకులు, యాజమాన్యాలు సంయుక్తంగా సమావేశమై స్థానిక టుబాకో మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నూతన వేతన ఒప్పందం అమలుకు వ్యాపారులు ఏకగ్రీవంగా ఆమోదించినట్టు తెలిపారు.




ప్రశంసా పత్రం అందజేస్తున్న చైర్మన్ గోకరాజు గంగరాజు

## వేడుకగా ఆశ్రం జూబ్లీ వేడుకలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):ఆశ్రం వైద్య కళాశాల ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు మంగళవారం ఏలూరులోని ఆసుపత్రి ప్రాంగణంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చేబ్రోలు శ్రీనివాస్, చైర్మన్ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జీ.రతీదేవి, కె.అంజిరెడ్డి, సీఈఓ కె.హనుమంతరావు, కె.శాంతయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్

## కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సదస్సు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఏలూరు అంబికా ప్లేవర్స్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు సిహెచ్ విక్రమ్ కిశోర్ అధ్యక్షతన మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎయిర్ పోర్టుల నిర్మాణం, జాతీయ రహదారులు, పోలవరం డయాఫ్రమ్ వాల్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పచ్చ మట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే అంబికాకృష్ణ పాల్గొని మాట్లాడారు.

## నష్టపరిహారం రికార్డుల పరిశీలన

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):జీలుగుమిల్లి మండల కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇటీవల ఎన్‌హెచ్ అధికారులు భూముల్ని గుర్తించారు. ఆయా గృహాలు, దుకాణాలు కోల్పోయె క్రమంలో సంబంధిత వ్యక్తులకు నష్టపరి హారం చెల్లించే జాబితా రికార్డులు మంగళవారం అధికారులు పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పోతురాజు, కృష్ణ, తహసీల్దారు ఉదయ్ భాస్కర్, వీఆర్వోలు రామతులసీ, బాషా, ఆశోక్, ఉన్నారు.



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న నాయకులు

## కూటమి నాయకుల ఎన్నికల ప్రచారం

బుట్టాయగూడెం/ లింగపాలెం/ భీమడోలు/ ద్వారకాతిరుమల/ జీలుగుమిల్లి/ ఏలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కూటమి నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నూతిరామన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రచారం నిర్వహించారు. జీలుగుమిల్లిలో బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం గెలుపునకు కృషి చేయాలని కోరారు. టీడీపీ లింగపాలెం మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో గ్రామ గ్రామానికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ద్వారకాతిరుమల మండలంలోని దొరసాని పాడులో టిడిపి సీనియర్ నేత కారుమంచి మురళి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో నేతలు మద్దిపాటి రత్నాజీ, పసుమర్తి శేఖర్, ఎంపిటిసి అల్లాడ హరేరామకృష్ణ, అల్లాడ సుబ్బారావు, చిట్టిబొమ్మ పండు, అల్లాడ గిరి, కమ్మరామకృష్ణ, నర్సయ్య పాల్గొన్నారు. భీమడోలు మండలం పూళ్ల జడ్పీ హైస్కూల్లో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, కూటమి సభ్యులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులు రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, కొప్పాక శ్రీనివాసరావు, వలవల తాతాజీ మీడియా సమావేశం నిర్వహించారు.




ఉత్సవాలకు ముస్తాబైన పాతాళ భోగేశ్వరస్వామి ఆలయం.. పంచబుగ్గల కోనేరు

## దక్షిణ కాశీగా పాతాళ భోగేశ్వరస్వామి క్షేత్రం

**కలిదిండి :** కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా వెలుగొందుతున్నది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశారు. ఈ ఆలయానికి విశిష్ట చరిత్ర ఉంది. వేంగిరాజు రాజరాజ చోళుడు పాలనా కాలంలో ఒక రైతు నాగలితో పొలం దున్నుతుండగా, నాగలి కర్రు తగిలి నెత్తురు వరదలై బయటపడ్డ స్వయం భూ లింగం ఆకారంలో ఉన్న స్వామివారిని బయటకు తీసి విరిగిన భాగాన్ని అతికించినట్లు చెబుతారు. ఇప్పటికీ లింగాకారం భాగం ఒక పక్క విరిగినట్టుగా దానిని తిరిగి అతికించినట్టుగా కనిపిస్తుంది. ఈ ఆలయం కలిదిండికి 3 మైళ్ల దూరంలో పొలాల మధ్య ఉంది. కోడికూత..రోకలి పోటు వినలేను కనుక నా ఆలయాన్ని అక్కడే నిర్మించమని స్వామివారు భక్తులను కలలో కోరినట్లు చెబుతారు. లింగాకారం లభించిన చోటనే ఆలయ నిర్మాణం జరిగినట్లు చెబుతారు. ఆలయ ప్రాంగణంలో పవిత్రమైన పంచబుగ్గల కోనేరు ఉంది. దీనిలో పంచబుగ్గలు ఉన్నాయి. భక్తులు కోనేరు చెంతకు చేరి హరహరా అంటుండగా బుడబుడమంటూ నీరు పైకి రావడం నేటికీ కనిపిస్తుంది. శివరాత్రి పర్వదినాన సుమారు 2 లక్షల మంది ప్రతి ఏడాది హాజరవుతారు.

### 1100 ఏళ్ల నాటి ప్రాచీన దేవాలయం

కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయాన్ని 1100 ఏళ్ల క్రితం నిర్మించారు. భూమి లోపల భాగంలో పాతాళంలో స్వయంభూ స్వామివారు ఉండటంతో పాతాళ భోగేశ్వరస్వామిగా పేరొందారు. కోడికూత రోకలి పోటు వినలేనని స్వామివారు భక్తుల కలలో కోరడంతో స్వామివారి లింగాకారం లభించిన చోటనే ఆలయాన్ని నిర్మించారు. ఒకరోజు స్వామివారి నిత్యార్చనకు జాప్యం జరగ డంతో ధ్వజస్తంభం ఎక్కి చూడగా అర్చకుల రాకను గమనించి ధ్వజస్తంభంపై దూకడంతో స్వామివారి పాదాల గుర్తులు ఏర్పడటాన్ని నేటికీ ప్రత్యక్షంగా వీక్షించచ్చు.

**మల్లికార్జునస్వామి, అర్చకుడు**

## శ్రీరాముడు ప్రతిష్ఠించిన బలివే రామలింగేశ్వరుడు



**ముసునూరు :** బలివే రామలింగేశ్వర స్వామి ఆలయం దక్షిణ కాశీగా వెలుగొందుతోంది. త్రేతాయుగంలో శ్రీరాముడు చేత లింగప్రతిష్ఠ జరిగినట్లు చరిత్ర చెబుతోంది. ప్రతి ఏటా ఐదురోజులు పాటు మహాశివరాత్రి మహోత్సవాలను వైభంగా నిర్వహిస్తారు. లక్షల్లో భక్తులు తరలివచ్చి తమ పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేసి, తర్పణాలు వదలి, తమ్మిలేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. శ్రీరాముడు రావణ సంహరణం అనంతరం బ్రహ్మహత్య దోష నివారణార్ధం మహా స్థలాలను ఎంచుకుని ఈశ్వర లింగ ప్రతిష్ఠ చేసుకుంటూ అయోధ్య చేరడానికి ముందు మహా అరణ్యమైన ఈ స్థలంలో ఆహ్లాదకర మైన వాతారవణం, శివధ్యాన దృష్టి గల భూమిగా గ్రహించి లింగప్రతిష్ఠ చేసినట్టు పురాణ కథనం. తదనంతరం బలిచక్రవర్తి ఈ ప్రాంతాన్ని పరిపాలించడంతో ఈ ప్రదేశానికి బలివే పేరు శాశ్వతమై, స్వామివారిని భక్తులు బలేరామస్వామిగా పిలుస్తూ ఉన్నారు. ఈ గ్రామ పరిసర ప్రాంతాలలో పూర్వం 101 లింగప్రతిష్ఠలు ఉండేవి. కాలక్రమేణా అవి శిథిలాలు కాగా, వీటిలో సుమారు ఐదు శివలింగాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనది శ్రీ మృత్యు మల్లేశ్వర స్వామి వారి దేవాలయం. రామలింగేశ్వర స్వామి దేవాలయానికి ఒక కిలోమీటరు దూరంలో తాతగుడిగా ఈ ఆలయాన్ని పిలుస్తారు. స్వామివారి రథోత్సవం నాడు తాతగుడికి వెళ్ళి ఆశీర్వాదం తీసుకునే సంప్రదాయం తరతరాలుగా ఉంది. 12వ శతాబ్దంలో నూజివీడు ప్రభువుల మూల పురుషుడు మేకా బసవ దండనాధులు పునఃనిర్మాణం చేసినట్లు ఆలయంపై శిలాఫలకం అనవాళ్ళు ఉన్నాయి.

### మహిమాన్వితుడు రామలింగేశ్వరుడు



రామలింగేశ్వరస్వామి భక్తుల కోర్కెలు తీర్చే మహిమగల స్వామిగా విరాజిల్లుతున్నారు. ప్రతి రోజు స్వామివారికి విశేష పూజలు జరుగు తాయి. మహాశివరాత్రి ఉత్సవాలు ఐదురోజులు స్వామివారి దర్శనానికి భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తారు. మా వంశీకులు రెండు తరాల నుంచి ఆలయంలో అర్చకులుగా పనిచేశారు. ప్రస్తుతం మూడో తరంలో నేను ఉన్నాను.

**- తోలేటి అరుణ భాస్కరరావు, ప్రధాన అర్చకుడు**

## భూమి నుంచి ఉద్భవించిన శివాలయం

**ముదినేపల్లి :** కృష్ణా జిల్లాలో 14వ శతాబ్దంలో రెడ్డి రాజవంశం పరిపాలనలో నిర్మించబడిన పురాతన శివాలయాల్లో ముదినేపల్లి మండలం పెదగొన్నూరు భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయం ఒకటి. ఆరు వందల సంవత్సరాల క్రితం ఆ గ్రామంలోని ఒక ప్రదేశంలో తవ్వకాల్లో బయటపడిన శివలింగాన్ని అదే ప్రదేశంలో ఆ గ్రామానికి చెందిన ఉప్పర్లు ఆవులను మేపుతుండగా ఒక ఆవు వచ్చి కాలితో నేలను గీకుతూ తవ్వమని సైగలు చేసిందట. గ్రామస్థుల సమక్షంలో ఆ ఉప్పర్లు నేలను తవ్వగా, చాలా లోతున శివలింగం బయటపడింది. ఆ శివలింగాన్ని గ్రామంలోని పురోహితుడు లంకా లింగయ్య ఆధ్వర్యంలో ఉప్పర్లు ప్రతిష్ఠించి చిన్నపాటి తాటాకు పాక నిర్మించారు. అనంతరం స్వామికి దూపదీప నైవేద్యాలకు మీర్జాపురం జమీందారు 25 ఎకరాల భూమి ఈనాంగా ఇచ్చారు.



పెదగొన్నూరులో శివలింగం

### ఇలాంటి శివలింగాలు అరుదు



భూమి నుంచి ఉద్భవించిన శివలింగాలు అతి తక్కువ. పెదగొన్నూరులో ఉద్భవించిన శివలింగాన్ని ప్రతిష్ఠించి ఆలయం నిర్మించడం కూడ అప్పట్లో జమీందారులు సైతం ఆశ్చర్యపోయి ఆలయానికి భూములు కేటాయించారు. భూమి నుంచి ఉద్భవించిన శివలింగం కావడంతో ఈ ఆలయం ఎంతో మహిమను కలిగి ఉంది.

**- లంక వెంకటేశ్వర బాబు, అర్చకులు**

## కాకతీయుల కాలంనాటి క్షేత్రం..

**చాట్రాయి :** చాట్రాయిలో పెద్ద చెరువు గట్టుపై కొలువైన ఉమారామలింగేశ్వరుడు కొలిచిన వారికి కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్నారు. చారిత్రక ఆధారాలను బట్టి కాకతీయ, రెడ్డి రాజుల కాలంలో 13వ శతాబ్దంలో ఇది గొప్ప పుణ్యక్షేత్రంగా విలసిల్లింది. ఆ రోజుల్లో 101 పరగణాలకు చాట్రాయి పాలనా కేంద్రంగా ఉండేది. దీనికి ఆనవాలుగా పెద్ద కోటలో పెద్ద ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం ఉండేది. శత్రు రాజుల దండయాత్రలు వల్ల కోట, ఆలయం కాలగర్భంలో కలిసిపోయాయి. 200 ఏళ్ల క్రితం ఓరైతు కోట శిథిలాలను తొలగించి భూమి సాగు చేస్తుండగా ఐదు అడుగుల ఎత్తయిన శివలింగం కన్పించింది. అప్పటి వాస్తు పండితుల సూచన ప్రకారం శివలింగాన్ని ఊరికి ఈశాన్యంలో పెద్ద చెరువు గట్టుపై ప్రతిష్ఠించి పూజలు చేయడం ప్రారంభించారు. ఆలయానికి కొద్ది దూరంలో కన్యకల బావి ఉంది. ఈ బావిలో రాత్రి సమయాల్లో దేవతా కన్యలు స్నానమాచరిస్తారని భక్తుల విశ్వాసం. ఈ బావి నీటితో 40 రోజుల స్నానమాచరించి శివుణ్ణి పూజిస్తే కుజదోషం ఉన్న కన్యలకు వెంటనే వివాహాలు జరుగుతాయని, ఎటువంటి మొండి రోగాలైన నయం అవుతాయని భక్తుల నమ్మకం.




చాట్రాయిలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో) చాట్రాయి పెద్ద చెరువు

### శివరాత్రికి మూడు రోజుల ఉత్సవాలు



చాట్రాయి ఉమారామలింగేశ్వరుడు మహిమలు కలిగిన దేవుడు. భక్తితో పూజిస్తే భక్తుల కోర్కెలు తప్పక తీరుస్తాడు. ఈ క్షేత్రానికి 700 ఏళ్ళ పైగా చరిత్ర ఉంది.మహా శివరాత్రికి 26, 27, 28 తేదీల్లో తిరునాళ్ళు జరుగుతాయి. 26న ఉదయం 5 గంటలకు శివునికి అభిషేకంతో ఉత్సవాలు మొదలవుతాయి. రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 12 గంటలకు రుద్రాభిషేకం జరుగుతుంది

**- కొలకలూరి సుధాకరశర్మ ఆలయ పూజారి, చాట్రాయి.**






విద్యుత్ దీపాలతో అలంకరించిన చాట్రాయి ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, కలిదిండి భోగేశ్వరస్వామి ఆలయం

# బలివే ఉత్సవాలకు సర్వం సిద్ధం

- **526మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు**
- **స్వామివారి సర్వదర్శనానికి ప్రత్యేక చర్యలు**

ముసునూరు, ఫిబ్రవరి 25: బలివే రామలింగేశ్వరస్వామి ఉత్స వాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో పామర్తి సీతారా మయ్య తెలిపారు. ఉత్సవాలకు సుమారు 2లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉందన్నారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశామని, రూ.25, రూ.100 ప్రత్యేక దర్శనం కూడా ఉంద న్నారు. బాహ్యలింగం వద్ద అభిషేకానికి రూ.200 టికెట్ ఉంటుందన్నారు. ఉత్సవాలకు ఆర్టీసీ 50 ప్రత్యేక బస్సులను ఏలూరు, చింతలపూడి, సత్తుపల్లి, నూజివీడు నుంచి నడుపుతుందన్నారు.



బలివే రామస్వామి



వీరభద్రపళ్లెం ఊరేగింపులో భక్తులు

### ఆటపాకలో వీరభద్రపళ్లెం ఊరేగింపు

కైకలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆటపాక కనకలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం విశేష హోమాలు, సాయంత్రం వీరభద్రపళ్లెం ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటా భక్తులు హారతులు పట్టారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు బందా వెంకటరమణయ్య, సత్య నారాయణ, నారాయణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కైకలూరు శ్యామలాంబ ఆలయంలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, కనకలింగేశ్వరస్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు.

### శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

కలిదిండి/ముదినేపల్లి/చాట్రాయి/ఆగిరిపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి, పెదలంక నాగేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు మల్లేశ్వరస్వామి, గురజ రామలింగేశ్వరస్వామి, వడాలి విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేసి పూజలు, అభిషేకాలు చేశారు. చాట్రాయి ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం శివ పార్వతుల కల్యాణం జరుగుతుంది. ఆగిరిపల్లి ముక్తేశ్వరస్వామి, విశ్వేశ్వరస్వామి, శోభనా చలుని ఎగువ కొండపై మల్లికార్జునస్వామి ఆలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు.. పోలింగ్ ఏర్పాట్లు పూర్తి



కైకలూరు పోలింగ్‌బూత్ పరిశీలిస్తున్న తహసీల్దార్

కైకలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లును పూర్తిచేసినట్లు తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తెలిపారు. కైకలూరులోని 3 పోలింగ్ బూత్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈనెల 27న జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. కైకలూరు ఎంపీయూపీ స్కూల్లో 13, 14 బూత్‌లు, ఓరియంటల్ జడ్పీ హైస్కూల్లో 15వ బూత్‌ను ఏర్పాటు చేశారు. మండలంలో 2,386 ఓట్లు ఉన్నాయన్నారు. కలిదిండి మండలం జడ్పీ హైస్కూల్లో 2 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 1633 ఓట్లు ఉన్నాయి. మండవల్లి మండలంలో 1,122 ఓట్లు ఉండగా 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 6,447 పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

● ముదినేపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు మండలంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జడ్పీ హైస్కూల్‌లో 2 పోలింగ్ కేంద్రాల్లో 1396 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. 12 మంది పీవోలు, ఏపీవోలు, సిబ్బందిని నియమించినట్లు తహసీల్దార్ సుభానీ తెలిపారు.




జనార్దనవరంలో టీడీపీ నాయకుల ప్రచారం.. ఊటుకూరులో పాండురంగారావు, వెంకటేశ్వరరావు ప్రచారం

## ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కలిదిండి/ముదినేపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచా రం చివరి రోజు కలిదిండి మండలంలో కూటమి నాయకులు అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని ముమ్మరంగా ప్రచా రం నిర్వహించారు. కలిదిండి మండలం కలిదిండి, పెదలంకలో కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, అక్కల వెంకటాచలం, అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ అంద్రాజు శ్రీనివాస్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి పాల్గొన్నారు. ముదినేపల్లి మండలంలో ఆలపాటికి ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరలమల్లు నరసింహరావు, పార్టీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ తదితరులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో పట్టభద్రులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులతో సమావేశాలను నిర్వహించి ఆలపాటికి ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేయాలన్నారు.

### నూజివీడు నియోజకవర్గంలో..

● నూజివీడు/చాట్రాయి : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఆలపాటి రాజా విజయాన్ని కోరుతూ నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి ఆధ్వర్యంలో పట్టణంలోని బాపూ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారాన్ని నిర్వహిం చారు. బీజేపీ నాయకులు ఎం.రాజశేఖర్, టీడీపీ నాయకులు కుమార్, కృష్ణారావు, సాంబశివరావు పాల్గొన్నారు. చాట్రాయి మండలం జనార్దనవరం, పోతనపల్లి, తదితర గ్రామాల్లో ఆలపాటి విజయాన్ని కోరుతూ టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



త్రివిధ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

### ఘనంగా త్రివిధ వార్షికోత్సవం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అవసరమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ భవానీప్రకాష్ అన్నారు. నూజివీడు త్రివిధ పాఠశాల 15వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.జమలయ్య, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీలో సిగ్నస్ కార్యక్రమం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ట్రిపుల్‌ఐటీలో వార్షిక సాంస్కృతిక కార్యక్రమం సిగ్నస్‌ను విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, మిస్, మిస్టర్ ఆర్జీయూకేటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రంగోలి, షార్ట్‌ఫిల్మ్ పోటీలను నిర్వహించారు.

● నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఎస్టీవోడే సందర్భంగా జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

### విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

నూజివీడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలోని పలు దుకాణాలపై ఏలూరు జిల్లా రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వి.రాంబాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తయారీ తేదీ, తయారీదారుని చిరునామా, ఎమ్మార్పీలు వంటి సమాచారాలు లేకుండా విక్రయాలు చేపడుతున్న దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. మొత్తం ఐదు సెల్‌ఫోన్ దుకాణాలపై తూనికలు, కొలతలు చట్టప్రకారం పదికేసులు నమోదు చేశారు.